సాక్షి
వికారాబాద్
సోమవారం । 5 । జూన్ । 2023



విద్యుత్ సమస్యలు గాలికి
తాండూరు పట్టణంలో రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 8లో▸



అందరికీ సంక్షేమ ఫలాలు
పరిగి నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



అడుగడుగునా గుంతలు
యాలాల మండల పరిధిలోని కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు ఉన్న సింగిల్ రోడ్డు గుంతలమయమైంది. 9లో▸

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఈ విషయం ప్రజలు గమనించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బంది పడవద్దని తెలిపారు.

నేడు విద్యుత్ విజయోత్సవాలు

కొడంగల్ రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఏడీఈ కె.నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ శివారులోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాలులో సోమవారం ఉదయం 10 గంటలకు విజయోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమానికి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జయరాజ్, డివిజనల్ ఇంజనీర్ భానుప్రసాద్‌లతోపాటు నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, మద్దూరు, కోస్గి మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొననున్నారని ఆయన తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో ఓపెన్ హౌస్



ఓపెన్ హౌస్‌ను తిలకిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లెట్స్, పిస్తోల్, గన్, డాగ్‌స్క్వాడ్ తదితర వాటిని ప్రదర్శించారు. ఎస్పీ కోటిరెడ్డి సందర్శించి వాటి పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు: మండల పరిధిలోని దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది రోజుల్లో రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ఆరు గంటల్లో పది సాధారణ కాన్పులు

మహిళా డాక్టర్‌ను అభినందించిన జెడ్పీ చైర్‌పర్సన్

తాండూరు టౌన్: పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఓ వైద్యురాలు రికార్డు స్థాయిలో ఆరు గంటల్లోనే పది సాధారణ ప్రసవాలు చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలుకొని రాత్రి 8 గంటల వరకు డ్యూటీ డాక్టర్ కరిష్మా కాన్పులు చేశారు. ఇందులో ఐదుగురు ఆడ, ఐదుగురు మగ శిశువులు జన్మించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ చైర్మన్ పట్నం సునీతారెడ్డి స్వయంగా వైద్యురాలికి ఫోన్ చేసి అభినందించారు.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి

మీర్‌పేట: కోట్లాది రూపాయలు వెచ్చించి మీర్‌పేట కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఆర్‌సీఐ రోడ్డు నుంచి డీఎస్‌ఆర్‌కాలనీ, లలితానగర్ మీదుగా నందనవనం వరకు రూ.20 లక్షలతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులు, రాఘవేంద్రనగర్ నుంచి న్యూ గాయత్రీనగర్ వరకు రూ.65 లక్షలతో రోడ్డు వెడల్పు, రూ.85 లక్షలతో ఆటో స్టాండ్ నుంచి క్రికెట్ గ్రౌండ్, పోస్ట్‌బాక్స్ వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో ప్రత్యేక ప్రణాళికతో గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే చందన చెరువును పూర్తి స్థాయిలో సుందరీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దామని, మిగతా చెరువులను త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నిధులు తెచ్చి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, దీంతో పాటు పట్టణ ప్రగతిలో భాగంగా సమీకృత మార్కెట్ పనులు చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు.. పిడుగులు



యాలాల: తొప్పెర్లగడ్డతండాలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు, దూడ

జిల్లాలో గాలివాన బీభత్సం

- పిడుగుపాటుకు పలు ప్రాంతాల్లో మూగజీవాల మృత్యువాత
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. కూలిన చెట్లు
- స్తంభించిన రాకపోకలు



కుల్కచర్ల: రాంనగర్ గ్రామంలో రోడ్డుపై పడ్డ చెట్టు



కుల్కచర్ల: సాల్వీడ్ గ్రామంలో పిడుగుపాటుతో మృతిచెందిన మేకల వద్ద రోదిస్తున్న బాధితులు

దోమ/కుల్కచర్ల/ యాలాల: జిల్లాలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. పలు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ఆవులు, ఎద్దులు, మేకలు మృత్యువాత పడ్డాయి. కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామంలో మేకల మందపై పిడుగుపడి 26 జీవాలు మృతిచెందాయి. దీంతో సుమారు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. దోమ మండలం ఐనాపూర్ నుంచి మల్లెపల్లే వెళ్లే ప్రధాన రహదారిపై భారీ చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొండాయపల్లి, దాదాపూర్‌లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. యాలాల మండలం తొప్పెర్లగడ్డతండాకు చెందిన తుల్సానాయక్‌కు చెందిన మూడు మేకలు, లేగదూడపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రైతులు కొనుగోలు సెంటర్ల వద్దకు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మోత్కూర్ గేట్ సమీపంలో రైతులు ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురువడంతో టార్పాలిన్లు లేక ట్రాక్టర్‌లపై ఉన్న ధాన్యం తడిసింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రైతులు అధైర్యపడవద్దని, ఆదుకుంటామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాలో కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, పశువుల మరణాలపై అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వరి ధాన్యాన్ని వంద శాతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే విషయాన్ని అధికారులు రైతులకు వివరించాలన్నారు. సోమవారం నుంచి సంబంధిత శాఖల అధికారులు ఉదయం 8 గంటలకే క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చే శనివారం లోపు 90 శాతం వరి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి రైస్ మిల్లర్ వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సవాలపై డేగకన్ను

సర్కార్ ఆరా!

- రోజువారీ కార్యక్రమాలపై నిశిత పరిశీలన
- ప్రజల భాగస్వామ్యంపై దృష్టి
- అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరుపైనా నజర్



యాలాలలో జరిగిన రైతు దినోత్సవంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సభ్యులు..

వికారాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలపై ప్రభుత్వం డేగకన్ను వేసింది. ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబురాలను నిశితంగా పరిశీలిస్తోంది. ఓ పక్క కలెక్టర్‌తో మరో పక్క ఇంటెలిజెన్స్ వింగ్‌తో కార్యక్రమాల నిర్వహణపై రోజువారీ నివేదికలు తెప్పించుకుంటారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు ఎలా ఉంది? ప్రజల భాగస్వామ్యం? టార్గెట్ ప్రకారం ఉత్సవాల్లో ప్రజలు పాల్గొంటున్నారా? ర్యాలీల్లో ఎంత మంది పాల్గొంటున్నారు? ఎంతమందికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు? ప్రజల స్పందన ఎలా ఉంది? అనే అంశాలను క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. కరపత్రాలు పంపిణీచేశారా? వాల్ పేపర్లు వేశారా? అందులో ఆయా మండలాలు, గ్రామాలు, క్లస్టర్లు, నియోజకవర్గాలు, శాఖల వారీ సమాచారం ఏ మేరకు పొందు పర్చారు.. ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలు ఏ మేరకు వివరించగల్గుతున్నారు? అనే విషయాలను రోజువారీగా క్రోడీకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. జిల్లాలో రోజువారి సమాచార సేకరణ బాధ్యతలు కలెక్టర్ జిల్లా పరిషత్ అధికారులకు అప్పగించగా వారు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

ఎమ్మెల్యేలకు సవాల్

దశాబ్ది ఉత్సవాల సక్సెస్ స్థానిక ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారింది. జిల్లాలో అందరూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉండటంతో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం చేసింది చెప్పుకోవడం ఎంతో అవసరం. అయితే ఎమ్మెల్యేల పనితీరుపై కూడా ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ఈ ఉత్సవాల నిర్వహణ ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా మారింది. ఒకవేళ తమ నియోజకవర్గాల్లో ఉత్సవాలు సక్సెస్ కాకపోతే అది తమ భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందనే సంకేతాలు బీఆర్‌ఎస్ పెద్దల నుంచి అందుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ఏ కార్యక్రమాన్ని తీసుకోనంత సీరియస్‌గా ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యేలు తీసుకుని నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత ఎక్కువ కార్యక్రమాల్లో పాల్గొనేలా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

రైతుల హాజరు అంతంతే..

ఉత్సవాల్లో రెండో రోజు శనివారం 97 రైతు వేదికల్లో రైతు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కో రైతు వేదిక కేంద్రంగా వెయ్యి మంది రైతులతో ర్యాలీ, సమావేశం అనంతరం భోజనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొన్ని చోట్ల 700 నుంచి వెయ్యి మంది వరకు రైతులు ఈ కార్యక్రమాలకు హాజరు కాగా కొన్ని చోట్ల 150 నుంచి 300 వరకు మాత్రమే హాజరయ్యారు. ఇందులో కూడా చాలా చోట్ల రైతులకు బదులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, టీఆర్‌ఎస్ నాయకులు కనిపించారు. ఏఈఓలు, ప్రత్యేకాధికారులు, అక్కడున్న టీఆర్‌ఎస్ నేతలకు బాధ్యతలు అప్పగించడంతో వారు రైతులకంటే ఎక్కువగా సంఘటితంగా ఉండే గ్రూపులను రైతు వేదికలకు తరలించటానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. అయితే అధికారులకు ఇచ్చిన నివేదికల్లో మాత్రం ఎక్కువ చోట్ల 800 నుంచి 1200 వరకు హాజరైనట్లు ఇచ్చారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు తదితర ముఖ్యులు హాజరైన చోట కొంత ఎక్కువగా జనాలను సమీకరించారు.

శాంతిభద్రతలే ముఖ్యం

- ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి
- ఘనంగా సురక్ష దినోత్సవం



ర్యాలీలో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పోలీసులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్, తాండూరు ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత శాంతిభద్రతల విషయంలో సీఎం కేసీఆర్ రాజీలేని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. తొమ్మిది ఏళ్ల పాలనలో పోలీసు శాఖలో వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. పోలీసులకు గతంలో పాత వాహనాలు ఉండేవని సీఎం కేసీఆర్ ప్రతి పీఎస్‌కు ఒక ఇన్నోవా కారును ఇచ్చి రక్షణ వ్యవస్థను ఎంతో బలోపేతం చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు లోబడి వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో సురక్ష ర్యాలీ

ఏరువాక సాగాలి.. సిరులు పండాలి



కుల్కచర్ల: హన్మాయపల్లిలో ఎడ్లబండ్ల ప్రదక్షిణ



కొడంగల్: ఎడ్ల బండ్లతో ఊరేగింపు

జిల్లాలో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. కాడెద్దులను శుభ్రంగా కడిగి అందంగా అలంకరించారు. వీధులగుండా ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. తొలకరి వర్షాలతో ప్రారంభమయ్యే ఏరువాక పండుగను రైతులు వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ. జిల్లా అంతటా ఏరువాక సందడి నెలకొంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అన్నదాతలు ఆకాంక్షించారు.

కోత్లాపూర్‌లో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

- రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు
- ముగిసిన జాతర

తాండూరు రూరల్: భక్తుల కొంగు బంగారమైన కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ జాతర చివరి రోజు ఆదివారం భక్తులు పోటెత్తారు. గత నెల 5వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు అమ్మవారి జాతర వైభవంగా కొనసాగింది. ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. గత నెల 19న అమ్మవారి రథోత్సవం, సిడే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, సర్పంచు సాయిలు తదితరులు ఉన్నారు.



జాతరలో భక్తుల సందడి

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- కాళ్లాపూర్‌లో బడిబాట కార్యక్రమం



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. మండల పరిధిలోని కాళ్లాపూర్‌లో బడిబాట నిర్వహించారు. స్థానిక పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహించిన యువకులను సన్మానించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి విద్యార్థుల వివరాలను సేకరించి పాఠశాల పనితీరుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను, అందిస్తున్న విద్యను వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా కొనసాగుతున్నాయన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టిసారించాలని కోరారు. నిత్యం పాఠశాలకు వచ్చి ఏ విధంగా చదువుతున్నదీ ఆరా తీయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, ఏఎండీ రవికుమార్, నోడల్ అధికారి గోపాల్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, సర్పంచ్ జంగయ్య పాల్గొన్నారు.

ఫార్మాసిటీతో ప్రపంచస్థాయి గుర్తింపు

యాచారం: ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనువాస్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 19,333 ఎకరాల్లో నెలకొల్పే ఫార్మాసిటీకి 80 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని తెలిపారు. ఫార్మాసిటీ ప్రారంభమైతే లక్ష మంది స్థానికులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని వ్యవసాయ భూముల ధరలు మరింత పెరుగుతాయన్నారు. భూసేకరణలో ఏ రైతుకూ అన్యాయం జరగనివ్వలేదని, మీరాఖాన్‌పేటలోని హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు ఇచ్చామని గుర్తు చేశారు.

క్లుప్తంగా

గృహ ప్రవేశానికి రండి



సఫాయి కార్మికులకు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్‌: తాండూరులో ఈ నెల 7న జరగనున్న నూతన గృహ ప్రవేశానికి రావాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ నాయకులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ నేతలను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. బసీరాబాద్‌ పంచాయతీ సఫాయి కార్మికులను కార్డులు ఇచ్చి గృహ ప్రవేశానికి రావాలని కోరారు.

ఉద్యమకారుడికి ఘన సన్మానం



లక్ష్మణాచారిని సన్మానిస్తున్న శుభప్రద్‌పటేల్‌

యాలాల: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణాచారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. కొడంగల్‌ పట్టణంలో నిర్వహించిన ఉద్యమకారుల విద్యా అవగాహన సదస్సులో భాగంగా బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్‌ పటేల్‌ ఆయనను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, శ్రీనివాస్‌గౌడ్‌, జెడ్పీటీసీ మహిపాల్‌, విద్యావంతుల వేదిక అధ్యక్షుడు పర్యాద రామకృష్ణ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం



సుజాతను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్‌: కొడంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌ పర్సన్‌ సుజాతను మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఆదివారం అభినందించారు. దౌల్తాబాద్‌ మండల కేంద్రంలోని ఆమె నివాసానికి వెళ్లి సన్మానించారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతాయుతంగా న్యాయంగా ఉంటూ రైతులకు మేలు చేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌, జయతీర్థాచారి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి హరీశ్‌రావుకు మొక్కను బహూకరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్‌: మంత్రి హరీశ్‌రావును కొడంగల్‌ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్‌ నియోజకవర్గంపై హరీశ్‌రావ్‌ ప్రత్యేక దృష్టి పెట్టినందుకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట షంబీపూర్‌ రాజు తదితరులు ఉన్నారు.

విద్యుత్‌ సమస్యలు గాలికి

- నిత్యం సరఫరాలో తీవ్ర అంతరాయం
- నడి రోడ్డుపైనే స్తంభాలు
- వాటిని ఢీ కొంటున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు

తాండూరు: పట్టణంలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌ స్తంభాన్ని ఈ నెల 25వ తేదీ రాత్రి లారీ ఢీ కొట్టింది. దీంతో విద్యుత్‌ స్తంభం విరిగిపోయి తీగలు తెగిపడ్డాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. పట్టణానికి విద్యుత్‌ సరఫరా చేసే ప్రధాన లైన్‌ కావడంతో తాండూరు అంతటా అంధకారం నెలకొంది. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సరఫరా లేక వినియోగదారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు గంటకోసారి విద్యుత్‌ సరఫరాను నిలిపి వేస్తూ వినియోగదారులకు విద్యుత్‌ శాఖ అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారు. జిల్లాలో మొత్తం విద్యుత్‌ శాఖ పరిధిలో రెండు డివిజన్‌ సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 3.32లక్షల కనెక్షన్లు ఉండగా, అందులో గృహ కనెక్షన్లు 2.27లక్షలు, కమర్షియల్‌ క్యాట్‌ 2 విభాగంలో 27,013 కనెక్షన్లు, కమర్షియల్‌ క్యాట్‌ 3 విభాగంలో 3,345 కనెక్షన్లు, పరిశ్రమలకు 50 కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఏటా విద్యుత్‌ శాఖకు రూ.140 కోట్ల వరకు సమకూరుతోంది. అయితే ప్రతి నెలా వినియోగదారుల నుంచి బిల్లులను వసూలు చేయడంలో సిబ్బంది ముందుంటారు. కానీ కరెంటు సరఫరా విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో విద్యుత్‌ తీగలు వేలాడుతు ప్రమాదకరంగా మారాయి. వ్యవసాయ కనెక్షన్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని రైతులు అంటున్నారు.

తాండూరులో అస్తవ్యస్తం

తాండూరు డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తాండూరులోని ఒక వార్డులో విద్యుత్‌ సరఫరాలో లోపం వస్తే పట్టణం మొత్తం సరఫరా నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. అందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్‌ సరఫరా ఆన్‌ ఆఫ్‌ చేసే పరికరాలు పని చేయడం లేదు. ఓ ఇంటికి కొత్తగా కనెక్షన్‌ ఇవ్వాలన్నా విద్యుత్‌ సరఫరాను మొత్తంగా నిలిపివేసే పరిస్థితులు ఉన్నాయి. తాండూరులో ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు 10 సార్లకు పైగా విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.



తాండూరులో నడిరోడ్డుపై విద్యుత్‌ స్తంభం

నడిరోడ్డుపైనే స్తంభాలు

పట్టణంలో రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు వేసి నాలుగేళ్లు అవుతుంది. అయితే ఇప్పటి వరకు ప్రధాన రోడ్డు ఉన్న విద్యుత్‌ స్తంభాలను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పట్టణంలోని ఇందిరాచౌక్‌ నుంచి రైల్వే స్టేషన్‌ వరకు, ఇందిరాచౌక్‌ నుంచి విలియంమూన్‌ సర్కిల్‌ వరకు రోడ్లపైనే విద్యుత్‌ స్తంభాలు ఉన్నాయి. నాలుగేళ్లు అవుతున్న అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

నిధులు మంజూరైన వెంటనే పనులు

కొన్ని రోజులుగా తాండూరు పట్టణంలో విద్యుత్‌ సరఫరా అంతరాయం కలుగుతున్న విషయం వాస్తవమే. విద్యుత్‌ వ్యవస్థ మెరుగు పరిచేందుకు ఉన్నతాధికారులకు నిధుల కోసం నివేదించడం జరిగింది. తాండూరులో రోడ్డుపై ఉన్న విద్యుత్‌ స్తంభాలను తొలగించాలంటే నిధులు మంజూరు కావాల్సి ఉంది. మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– ఆదినారాయణ, ఏడీఈ, తాండూరు

అనంతపద్మనాభుడికి ఎమ్మెల్యే పూజలు

అనంతగిరి: వికారాబాద్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆయన కుటుంబసమేతంగా అనంతగిరి గుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే నివాసం, క్యాంపు కార్యాలయం వద్దకు బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్‌ కట్‌ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రక్తదానం చేశారు. ఎంపీ సంతోష్‌కుమార్‌ విసిరిన గ్రీన్‌ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కను నాటారు. అనంతరం ఎమ్మెల్యే నగరంలో మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



అనంతగిరి ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ దంపతులు

వాలీబాల్‌ పోటీలు ప్రారంభం



తాండూరుటౌన్‌: వాలీబాల్‌ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డి

తాండూరు టౌన్‌: శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పైలట్‌ రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గుండుపీర్ల వద్ద యువతకు వాలీబాల్‌ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో నేరాల అదుపు కోసం పోలీసు శాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థతో ప్రజల సమస్యలను తీరుస్తున్నామన్నారు. ట్రాఫిక్‌ నియమాలు, సైబర్‌ నేరాలు, డయల్‌ 100, షీటీంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సురక్షా దినోత్సవంలో భాగంగా యువతకు వాలీబాల్‌ పోటీలు నిర్వహించామన్నారు. ఆరు జట్లు పాల్గొనగా ఫైనల్‌లో మంబాపూర్‌ జట్టు, సాయినగర్‌ జట్టుపై విజయం సాధించిందన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

కద్లాల్‌: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ సభ్యుడు ఏ శ్రీనివాస్‌గౌడ్‌ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ..పేద ప్రజలకు అండగా ఉండేది ఒక్క కాంగ్రెస్‌ పార్టీయేనని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే వంట గ్యాస్‌ సిలిండరు, ఆరోగ్య శ్రీ అమలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు, అర్హులైన పేదలకు రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టనుంద ని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రె స్‌ అధ్యక్షుడు ఏ నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌, కోఆప్షన్‌ సభ్యుడు జహంగీర్‌బాబా,సర్పంచ్‌లు విఠలయ్య గౌడ్‌, సేవ్యానాయక్‌, నాయకులు రమేశ్‌, జనార్దన్‌, శ్రీను, లక్ష్మయ్య, రవి, మల్లయ్య, రాజేందర్‌, ఇమ్రాన్‌, మల్లేశ్‌గౌడ్‌, యాద య్య, హీరాసింగ్‌, తులసీరాం పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దుల మృతి

పరిగి: పిడుగు పాటుకు రెండు కాడెడ్లు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రంగంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన యాదయ్య తన రెండు ఎడ్లను రోజు మాదిరిగానే పొలం వద్ద కొట్టంలో కట్టేశాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి పిడుగుపడడంతో ఎద్దులు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ యాదయ్య, సీపీఐ ఎంఎల్‌ నాయకులు మల్లేశ్‌ తదితరులు ఘటనాస్థలికి చేరకుని ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.



పిడుగుపాటుతో మృత్యువాత పడిన ఎద్దులు

అ'పూర్వ' సమ్మేళనం

కుల్కచర్ల: చౌడాపూర్‌ మండలం మరికల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 2003–04 పదో తరగతి బ్యాచ్‌ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం వారికి బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



నాటి ఉపాధ్యాయులతో మరికల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 2003-04 బ్యాచ్‌ విద్యార్థులు

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలం

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్‌, లాల్‌సింగ్‌ తండా, బండమీది తండాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలితాలు అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుల్కచర్ల ఎస్‌ఐ శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌ నాయక్‌, వైస్‌ ఎంపీపీ రాజశేఖర్‌, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్‌ కమిటీ కమిటీ చైర్మన్‌ హరికృష్ణ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, నాయకులు రాజప్ప, కొండయ్య, రవీందర్‌, నర్సింలు, సత్యనారాయణ, రాములు, చిన్నయ్య, సాయికిరణ్‌ గౌడ్‌, కృష్ణయ్య పాల్గొన్నారు.



తాండూరు టౌన్‌: ఎద్దులతో ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి



పరిగి: రాఘవాపూర్‌లో ఎద్దులను ముస్తాబు చేసిన రైతు

రైతు పండుగ ఏరువాక

జిల్లాలో రైతు పండుగ ఏరువాకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు కుటుంబ సభ్యులతో కలసి ఈ వేడుకలో పాల్గొన్నారు. కాడెద్దులను అందంగా ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.



బొంరాస్‌పేట: ఏరువాక ఉత్సవంలో ఎడ్ల బండ్లతో ఊరేగింపు



బషీరాబాద్‌: ఎడ్లబండిపై ఊరేగుతున్న చిన్నారులు



ధారూరు: డప్పు వాయిద్యాల నడుమ ఎడ్లబండ్ల ఊరేగింపు

ఇసుక టిప్పర్‌ సీజ్‌

పరిగి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్‌ చేశారు. ఈ ఘటన పరిగి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌ గ్రామ సమీపంలోని జిప్సం ఫ్యాక్టరీ వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్‌ పోలీసులు గమనించి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుంమతులు లేకపోవడంతో టిప్పర్‌ సీజ్‌ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీసీ కమిషన్‌ మెంబర్‌ శుభప్రద్‌పటేల్‌

కొడంగల్‌ రూరల్‌: అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులకు ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు కృషిచేయాలని తెలంగాణ బీసీ కమీషన్‌ మెంబర్‌ ఎస్‌ శుభప్రద్‌పటేల్‌, పిలుపునిచ్చారు. పీసీసీ అధికార ప్రతినిధి పామెనా భీమ్‌ భరత్‌, జెడ్పీ వైస్‌ చైర్మ న్‌ బైండ్ల విజయకుమార్‌, పాలమూరు ఉస్మానియా యూనివర్సిటీ వక్తలు ప్రొఫెసర్‌ డాక్టర్‌ పి.శివకుమార్‌సింగ్‌, డాక్టర్‌ ఉదయ భాను పాల్గొన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్‌ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఏ శ్రీనివాస్‌ అధ్యక్షతన 10వ తరగతి, ఇంటర్‌, ఆపై తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమెంటోలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ప్రతీ విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులను సన్మానించారు. దౌల్తాబాద్‌ జెడ్పీటీసీ మహిపాల్‌, కౌన్సిలర్‌ మధుసూదన్‌ యాదవ్‌, నాయకులు రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌, బషీర్‌, రామన్న, శ్రీనివాస్‌గౌడ్‌, భీములు, కేశవులు, రమేష్‌బాబు, ముకుంద నాగేశ్వర్‌, శివరాంసింగ్‌, వెంకటయ్య, మంచన్‌పల్లి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

షాబాద్‌: బైక్‌ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో బైక్‌ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌ నడిపిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన షాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్‌ తెలిపిన ప్రకారం వివరాలు.. షాబాద్‌కు చెందిన అంజాద్‌(35), టీ శేఖర్‌(40) బైక్‌పై షాబాద్‌లోని హరిజనవాడ నుంచి గ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శేఖర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. అంజాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియాకు తరలించారు.